
క్లుప్తంగా

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


ప్రారంభించిన అభయ అంజనేయస్వామి విగ్రహం

కొయ్యలగూడెం: శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. తిమ్మనకుంట రోడ్ లోని ప్రభుత్వ పాఠశాల జంక్షన్‌లో పీఠంతో సహా సుమారు 15 అడుగుల ఎత్తులో అభయహస్తంతో ఉన్న స్వామివారి విగ్రహాన్ని నెలకొల్పగా ఉదయం 11.27 గంటలకు అనురాధ నక్షత్ర యుక్త కర్కాటక లగ్నములో ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో రెండు వేల మందికి పైగా భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం భక్తులు పారాయణాధి కార్యక్రమాలు నిర్వహించారు.

అనంతేశ్వరస్వామికి అభిషేకాలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ముత్యాలమ్మ అమ్మవారి దివ్యసన్నిధిలో కొలువై ఉన్న అనంతేశ్వర స్వామికి, ముత్యాలమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మ కుమారి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు మిత్తిపాటి విశ్వనాథ శ్రీనివాస్ శర్మ పంచామృత ఏకవార రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

నూకాలమ్మ రజత వస్త్రానికి వెండి సమర్పణ


అమ్మవారి రజత వస్త్రానికి వెండిని సమర్పిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీనూకాలమ్మ తల్లిని శుక్రవారం విశేషంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి రజత వస్త్రం తయారీకి కరాటం శివాజి, గిరిజారాణి దంపతులు 10 తులాల వెండి, పసుమర్తి రమాదేవి, రోహిత్ (చాగల్లు) 10 తులాల వెండి, బూరి కృష్ణ, రాజ్యలక్ష్మి దంపతులు 5 తులాల వెండి సమర్పించినట్లు ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు. నారగాని సత్తిరాజు, వెంకట లక్ష్మీ దంపతులు ఆలయ అభివృద్ధికి రూ.5,116 విరాళంగా అందజేశారని చెప్పారు.

ప్రభుత్వ కళాశాలకు ప్రింటర్ల బహూకరణ


సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాలకు ప్రింటర్‌లు బహూకరించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రిశత జయంతి ప్రభుత్వ కళాశాలకు విజయవాడకు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ రాజేష్ 5 ప్రింటర్లను బహూకరించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు తెలిపారు. దాతకు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. స్థానిక అశ్వారావుపేట రోడ్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్ వెనుక గల స్థలంలో బ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణ శంకుస్థాపన గౌరవ అధ్యక్షుడు మల్లాది సీతారామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థలదాత, వైఎస్సార్ సీపీ పామర్రు నియోజక వర్గ పరిశీలకులు మండవల్లి విజయసారధికి అధ్యక్షుడు చిలుకూరి సాయిబాబు, గౌరవ సలహాదారు కర్ర శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణ కమ్యూనిటీ సంక్షేమ భవన నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేయాలని సాయిబాబు కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కొయ్యలగూడెం: పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఎన్నికల అబ్జర్వర్, రిటరినింగ్ అధికారి ఎస్‌పీ శ్రీరామన్ పేర్కొన్నారు. పరింపూడిలోని పోలింగ్ సెంటర్ 227 (ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల) జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్‌లను శుక్రవారం ఐటీడీఏ పీవో సూర్యతేజతో కలిసి ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు పోలింగ్ బూత్‌లలో ఏర్పాటుచేసిన సదుపాయాలు, అదేవిధంగా ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యల గురించి తహసీల్దార్ రాజ్యలక్ష్మి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ అధికారి ఆర్ఐ మణిదివ్య, వీఆర్వో రామ్మోహన్, మక్బుల్, బీఎల్‌ఓలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా..

రైతు భరోసా కేంద్రాలు – 108, పనిచేసే ఉద్యోగులు – 164 మంది
అంచనా వ్యయం మొత్తం – 24 కోట్ల 17 లక్షలు


జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెంలోని రైతుభరోసా కేంద్రం


కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంలోని రైతుభరోసా కేంద్రం


బుట్టాయగూడెంలో నిర్మించిన రైతుభరోసా కేంద్రం

బుట్టాయగూడెం: రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిద్వారా రైతులకు అన్ని రకాల సేవలను అందిచేలా ఏర్పాట్లు చేశారు. గ్రామగ్రామాన రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకేలు) నిర్మించారు. విత్తనం నుంచి పంట విక్రయం వరకూ రైతులకు అన్ని రకాల సేవలను ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్నారు. ఇక్కడ సబ్సిడీ, నాన్ సబ్సిడీ విత్తనాలతో పాటు ఎరువులు, పురుగుమందులు అందజేస్తునఆనరు. కౌలు రైతులకు సీసీఆర్‌టీ కార్డులు (పంట సాగు హక్కు పత్రం) జారీ చేస్తారు. పంటల నమోదు (ఈ క్రాప్ బుకింగ్) చేస్తారు. వైఎస్సార్ రైతు భరోసా నమోదు ఇక్కడే చేస్తారు. దీంతో ఆర్బీకే వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఈ వ్యవస్థను అమలు చేసేందుకు రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌తో పాటు పలు రాష్ట్రాల ఉన్నతాధికారుల బృందం కూడా ఆంధ్రప్రదేశ్‌లోని రైతుభరోసా కేంద్రాలను పర్యవేక్షించింది.

ఆర్‌బీకేల సేవలు ఇలా..

- పంట నమోదుతో ఉచిత పంటల బీమాను అమలు చేస్తారు. ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లించడంతో ఈ క్రాప్ బుకింగ్ అయితే పంటల బీమాకు అర్హత వస్తుంది.
- అతివృష్టి, అనావృష్టి సంభవించినప్పుడు పంట నష్టంపై సర్వే చేసి రైతులకు నెల రోజుల్లోపే పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటారు.
- వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి డ్రిప్, పశువుల దాణా, గడ్డివిత్తనాలు, తదితర రైతులకు అవసరమైనవి ఆర్బీకే ద్వారానే అందిస్తున్నారు. రైతులకు అవసరమైతే సబ్సిడీ విత్తనాలను కూడా ఆర్బీకే ద్వారా తెప్పిస్తారు.
- పంటలకు మద్దతు ధర లేనప్పుడు కనీస మద్దతు ధరతో ధాన్యంతో పాటు అన్ని రకాల ఉత్పత్తులను ఆర్బీకేలో కొనుగోలు చేస్తారు.
- ఆర్బీకే ఉద్యోగి సెలవుపై వెళ్లినా రైతులకు ఇబ్బంది లేకుండా సెలవు రోజు వలంటీర్‌లకు వీటి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.


పోలవరం రైతుభరోసా కేంద్రం


వేలేరుపాడు మండలం మేడేపల్లి రైతు భరోసా కేంద్రం


టి.నర్సాపురం రైతుభరోసా కేంద్రం

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ కార్యాలయంలోని రిటర్నింగ్ కార్యాలయాన్ని శుక్రవారం పోలవరం ప్రత్యేక అబ్జర్వర్, తమిళనాడు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ శ్రీరామన్ సందర్శించారు. స్ట్రాంగ్ రూంను పరిశీలించి అక్కడ చేసిన ఏర్పాట్లపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. అలాగే కొయ్యలగూడెం మండలంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

చింతలపూడికి 9 నామినేషన్లు

చింతలపూడి: సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం ముగిసింది. చింతలపూడి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కె అద్దయ్య అభ్యర్థుల నామినేషన్ పత్రాలను పరిశీలించారు. చింతలపూడి అసెంబ్లీ స్థానానికి 12 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. పరిశీలన అనంతరం 9 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అద్దయ్య ప్రకటించారు. త్వరలోనే స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కేటాయిస్తామని తెలిపారు. నామినేషన్ల పరిశీలనకు అభ్యర్థులు, వారి తరపున రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు.

జగన్‌కు చింతలపూడిని కానుకగా ఇవ్వాలి


వడ్లపల్లిలో ఎన్నికల ప్రచారంలో కంభం విజయరాజు


దొరసానిపాడులో వనితకు మద్దతుగా వైఎస్సార్ సీపీ శ్రేణుల బైక్ ర్యాలీ

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు

కామవరపుకోట: చింతలపూడిలో వైఎస్సార్ సీపీని గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు పిలుపునిచ్చారు. మండలంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కామవరపుకోట పంచాయతీ వడ్లపల్లి, తాడిచర్ల, ఆడమిల్లి, తడికలపూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ, ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. తాడిచర్ల, ఆడమిల్లి గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని, దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళలకు రాజకీయాల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రభుత్వం అందించే అనేక పథకాలు మహిళలకు అందించి వారి ఆర్థిక అభివృద్ధికి అండగా నిలిచి, కుటుంబంలో వారి గౌరవం పెంచారని వివరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందించిన సంక్షేమ పథకాలు గ్రామస్తులకు వివరిస్తూ, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా 130 సార్లు బటన్ నొక్కి ఇంటికి సంక్షేమ పథకాలు అందించారని, మీరు రెండుసార్లు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని విజయరాజు కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, మేడూరి రంగబాబు, ఇమ్మడి రాంబాబు, మిడత మారయ్య, పండు, వేముల సాయి, సాయిబాబా, దాసి పండు, కొత్తపల్లి రజిని శ్రీనివాస్, గంగుల కడియాలు, కొప్పర్తి లక్ష్మి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: మంత్రి వనిత శుక్రవారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి వనిత ప్రచార ర్యాలీకి గ్రామాల్లో ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులు పట్టి విజయతిలకం దిద్దారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని బోయగూడెం, ముదిరాజుల కాలనీలో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేదల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మరోసారి పట్టం కట్టాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గంధం రామ్మోహన్‌రావు, మండల సచివాలయాల కన్వీనర్ ఎం రాంబాబు, పట్టణ సచివాలయాల కన్వీనర్ బి చెంచమరాజు, పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జి గద్దమడుగుల రాజేష్‌నాయుడు, వెంపా కృష్ణ, బండారు గోపి , చంద్రశేఖర్‌రెడ్డి, ప్రకాష్, ఎన్ దుర్గారావు, పెరుమాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో 13 నామినేషన్లకు ఆమోదం


కేఆర్‌పురం ఐటీడీఏ రిటర్నింగ్ కార్యాలయం వద్ద నామినేషన్లు పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి సూర్యతేజ

బుట్టాయగూడెం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం జరిగిన నామినేషన్ల పరిశీలనలో పోలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి 13 నామినేషన్లను ఆమోదించినట్లు ఐటీడీఏ పీఓ, పోలవరం రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ తెలిపారు. పోలవరం ప్రత్యేక అబ్జర్వర్‌గా నియమితులైన తమిళనాడు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ శ్రీరామన్, సూర్యతేజ నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి పలువురు పార్టీ నాయకులు కూడా హాజరయ్యారు. మొత్తం 23 నామినేషన్లు రాగా 10 నామినేషన్లు తిరస్కరించినట్లు సూర్యతేజ తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి, జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దువ్వెల సృజన, గోండ్వానా దండకారణ్య పార్టీ అభ్యర్థి మడకం వెంకటేశ్వరరావు, భారత్ ఆదివాసీ పార్టీ అభ్యర్థి మొడియం శ్రీనివాసరావు, పీఎస్‌పీ పార్టీ అభ్యర్థి మడకం వెంకటేశ్వరరావు, యువతరం పార్టీ అభ్యర్థి ఉయికే మంగమ్మతోపాటు మరో 6 నామినేషన్‌లను ఆమోదించినట్లు తెలిపారు.

మంత్రి వనిత పరామర్శ


బాధిత మహిళలను ఓదార్చుతున్న మంత్రి వనిత

ద్వారకాతిరుమల: మండలంలోని పి.కన్నాపురం పంచాయతీ చిన్న ఎగ్గేవురం గ్రామంలో అగ్నిబాధిత కుటుంబాలను రాష్ట్ర హోంశాఖ మంత్రి, గోపాలపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత శుక్రవారం పరామర్శించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈనెల 24న గ్రామానికి చెందిన గుంపుల భూషణం తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఆ ఇంట్లో నివసిస్తున్న నాలుగు కుటుంబాలు సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న మంత్రి వనిత ఘటనా ప్రదేశానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. మళ్లీ మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని విధాల ఆదుకుంటామని వారికి భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, బొండాడ వెంకన్న బాబు, దాకారపు బంగారమ్మ, దాసరి రాంబాబు, అల్లే వెంకన్న, కుక్కల గట్టియ్య, కొడుదుల ప్రసాద్, తణుకు సురేష్, ఆచంట బన్ను తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే..

కొయ్యలగూడెం: నవ్యాంధ్రకు ప్రత్యేక హోదాతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన జన చైతన్య యాత్ర శుక్రవారం కొయ్యలగూడెంకి చేరుకుంది. మెయిన్ సెంటర్లో ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, సభ్యులు గేయాలు, నృత్య రూపంలో అభినయించారు. పదహారు సమస్యలపై ప్రజలలో చైతన్యం కల్పించేందుకు ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఏప్రిల్ 14వ తేదీ నెల్లూరులో ప్రారంభమైన యాత్ర మే 4వ తేదీ పలాసలో ముగుస్తుందని తెలిపారు.

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర విభజన సమయంలో నవ్యాంధ్రప్రదేశ్ కు ఇచ్చిన హామీలను బీజేపీ ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్ల రాష్ట్రం తీవ్ర సమస్యలను ఎదుర్కొంటుందని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు సింగోతు నాగేంద్ర రావు, కొండా దుర్గారావు అన్నారు. జనచైతన్య ప్రచార యాత్ర శుక్రవారం జంగారెడ్డిగూడెం చేరుకుంది.

అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే


సీహెచ్ జ్ఞానారెడ్డి

చింతలపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి అన్నారు. చింతలపూడిలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని ఈ ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని చెప్పారు. మేనిఫెస్టోను ఒక భగవద్గీతగా, ఖురాన్, బైబిల్‌లా భావించి నవరత్నాలను అమలు చేశారని అన్నారు. చంద్రబాబు 2014లో బీజేపీతో కలిసి కాపురం చేసి ప్రత్యేక హోదా వద్దు ప్యాకేజీ కావాలని తెచ్చుకున్నారని గుర్తు చేశారు. 2019లో రాష్ట్రాన్ని నిట్టనిలువుగా చీల్చిన కాంగ్రెస్ పార్టీతో జతకలిసి చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మోసం చేశారని అన్నారు. మళ్లీ కాంగ్రెస్‌కు విడాకులు ఇచ్చి బీజేపీతో కలిసి ప్రజలను మరోసారి మోసం చేయడానికి వస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఆదర్శవంతంగా వైఎస్ జగన్ పాలన


జంగారెడ్డిగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా ఆదర్శవంతమైన పాలన అందించారని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో శుక్రవారం గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు 10వ వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. పేదలకు ఇళ్లు, జగనన్న చేయూత, డ్వాక్రా రుణమాఫీ, అమ్మ ఒడి తదితర సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ఏవిధంగా చేరువయ్యాయో వివరించారు. ఏలూరు ఎంపీగా కారుమూరు సునీల్‌కుమార్‌ను, చింతలపూడి ఎమ్మెల్యేగా కంభం విజయరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్, రాష్ట్ర మహిళా సెక్రెటరీ కాసర తులసి రెడ్డి, 10వ వార్డు ఇన్‌చార్జులు ఉగ్గం దుర్గాప్రసాద్, కాసర శేషారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, ఏలూరు జిల్లా జేసీఎస్ కన్వీనర్ చింత అనిల్‌కుమార్ గౌడ్, పార్టీ ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు గెద్దాడ శ్రీను, చింతలపూడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తాతకుంట్ల రవికుమార్, కౌన్సిలర్లు నేకూరి కిషోర్, ఉగ్గం దుర్గాప్రసాద్, సంకు సురేష్, తాతకుంట్ల నాగలక్ష్మి, గోకుల పారిజాతగిరి చైర్మన్ గూడపాటి రాధాకృష్ణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నూతన గరిష్టానికి వర్జీనియా ధర

- ఒక్క రోజులోనే కేజీ రూ.24 పెరుగుదల
- రూ.327కు చేరిన వర్జీనియా ధర


వర్జీనియా పొగాకు బేళ్లు

జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకు ధర వర్జీనియా చరిత్రలోనే నూతన రికార్డులు సృష్టిస్తూ దూసుకుపోతుంది. శుక్రవారం ఎన్నడూ లేని విధంగా కేజీ ధర రూ.327 లభించింది. దీంతో రైతుల్లో నూతన ఉత్సాహం కనిపిస్తోంది. వర్జీనియా రైతులు తమ కష్టానికి సరైన ఫలితాలు వస్తున్నాయని సంతోష పడుతున్నారు. గత ఏడాది అత్యధికంగా కేజీకి రూ.288 లభించగా, ఆ రికార్డును బ్రేక్ చేసి గురువారం కేజీ ధర రూ.303 గరిష్టానికి చేరుకుంది. శుక్రవారం మరోసారి రికార్డులను బ్రేక్ చేస్తూ గురువారం నాటి ధర కన్నా రూ.24 ఎక్కువగా పలికి, రూ. 327 కేజీ ఒక్కింటికి లభించింది. ఈ ఏడాది తుపాను కారణంగా వర్జీనియా పంట తీవ్రంగా దెబ్బతింది. దీంతో రైతులు దెబ్బతిన్న పంటల స్థానంలో రెండోసారి పంటలు వేశారు. ఇదే సమయంలో అంతర్జాతీయంగా పొగాకు పంట ఉత్పత్తి తగ్గిపోవడంతో స్థానికంగా ఉన్న దేశీయ పొగాకుకు డిమాండ్ పెరిగింది. ఎగుమతుల ఆర్డర్లు కూడా అదే స్థాయిలో రావడంతో వర్జీనియా ధరకు రెక్కలు వచ్చాయి. ఈ ఏడాది మార్చి 6వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని జంగారెడ్డిగూడెం–1, –2, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి వేలం కేంద్రాల్లో వర్జీనియా వేలం ప్రారంభమైంది. ప్రారంభధర కిలోకు రూ.240 లభించింది. ఇది క్రమేపీ పెరుగుతూ ఏప్రిల్ 20న రూ.266, 22న రూ.272, 24న రూ.287, గురువారం రూ. 303కు చేరుకుంది. శుక్రవారం మరో మెట్టు ఎక్కి ఆల్‌టైం రికార్డును నమోదు చేస్తూ రూ. 327కు ధర చేరుకుంది. ఉమ్మడి జిల్లాలో దేవరపల్లి, కొయ్యలగూడెం వేలం కేంద్రాల్లో వర్జీనియా కేజీ ధర రూ.327 లభించగా, గోపాలపురం రూ.324 జంగారెడ్డిగూడెం 1వ వేలం కేంద్రంలో రూ.321, 2వ వేలం కేంద్రంలో రూ.319 లభించింది. ఇదిలా ఉంటే వర్జీనియా ధర ఆశించిన స్థాయి కన్నా ఎక్కువ లభిస్తుందని, లోగ్రేడ్, మధ్య తరగతి గ్రేడ్ పొగాకును రైతులు వేగంగా వేలం కేంద్రాలకు తరలించుకుని అమ్ముకోవాలని పొగాకు బోర్డు అధికారులు సూచిస్తున్నారు. రానున్న రోజుల్లో మంచి గ్రేడ్‌కు మరింత ఎక్కువ లభించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, దేవరపల్లి వేలం కేంద్రానికి శుక్రవారం 1033 బేళ్లు, జంగారెడ్డిగూడెం –1వ కేంద్రానికి 1254, జంగారెడ్డిగూడెం 2వ కేంద్రానికి 918, కొయ్యలగూడెం కేంద్రానికి 1279, గోపాలపురం కేంద్రానికి 1210 బేళ్లు వేలానికి వచ్చాయి.

పొలాల్లో అగ్నిప్రమాదం

పోలవరం రూరల్: పోలవరం మండలం ప్రగఢపల్లి పంచాయతీ పరిధిలోని వింజరం, వెంకటరెడ్డిగూడెం గ్రామాల మధ్యలో పంట పొలాల్లో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. పొలాల్లో మొక్కజొన్న పంట అయిపోయిన తరువాత తుక్కును రైతులు తగులబెట్టే పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో సమీపంలో ఉన్న మూడున్నర ఎకరాల వరి కుప్ప, సుమారు 30 ఎకరాల్లో ఉన్న మొక్కజొన్న పంట దగ్ధమైంది. ఘటన తెలిసిన వెంట మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు, పోలీసులు అగ్నిప్రమాదం జరిగిన పంట పొలాల ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. ఘటన వివరాలను కూడా రైతుల నుంచి తెలుసుకున్నారు.

శ్రీవారి సేవలో...


రాష్ట్ర ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ శ్రీధర్‌కు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని శుక్రవారం రాష్ట్ర ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ శ్రీధర్ (ఐపీఎస్) సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను శ్రీధర్ దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈఓ బాబురావు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, భీమడోలు సీఐ బీబీ రవికుమార్ తదితరులున్నారు.